సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం। 18। మార్చి। 2024



మహిళల ప్రగతికి చిహ్నం

రాష్ట్రంలోని అగ్రవర్ణ పేద మహిళలకు ఈబీసీ నేస్తం పథకం వరంగా మారింది. జిల్లాలో 54 వేల మంది పైగా మహిళలకు రూ.82 కోట్లకు పైగా లబ్ధి చేకూరింది. 8లో



కోడ్ కూసింది

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో ఉన్న రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సాయంత్రం)	సహరి మంగళవారం (ఉదయం)
భీమవరం	6.20	4.50
ఏలూరు	6.21	4.47

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గ్రూప్‌-1 పరీక్షలు



తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద అభ్యర్థులు

భీమవరం : జిల్లాలో గ్రూప్‌–1 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగినట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉదయం పరీక్షకు 62.20 శాతం, మధ్యాహ్నం పరీక్షకు 61.68 శాతం మొత్తంగా 61.94 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లాలో 7 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు ఉదయం పేపర్‌–1కు 4,209 మందికి 2,618 మంది, మధ్యాహ్నం పేపర్‌–2కు 4,209 మందికి 2,596 మంది హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్షల నిర్వహణ పూర్తిచేశామని పేర్కొన్నారు. పరీక్షల అనంతరం ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర పరీక్షా సామగ్రి పత్రాలను పటిష్ట బందోబస్తుతో స్ట్రాంగ్‌రూమ్‌కి తరలించామని, తదుపరి ఏపీపీఎస్సీ అధికారులు ప్రత్యేక భద్రతతో విజయవాడ తరలిస్తారని కలెక్టర్ వివరించారు.

గూడెంలో 52.50 శాతం హాజరు

తాడేపల్లిగూడెం (టీటీసీ): తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో గ్రూప్‌–1 పరీక్షలకు 52.5 శాతం హాజరు నమోదైనట్టు ప్రిన్సిపాల్, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రత్నాకర్ తెలిపారు. ఉదయం పరీక్షకు 662 మంది, మధ్యాహ్నం పరీక్షకు 733 మంది హాజరయ్యారన్నారు. అదనపు సూపరింటెండెంట్లు గోపాలకృష్ణ, సుబ్రహ్మణ్యం పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని చెప్పారు.

స్పందన రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లావ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నియమావళి (కోడ్) అమలులో ఉన్నందున భీమవరం కలెక్టరేట్, జిల్లాలోని డివిజినల్, మండల కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని ప్రకటనలో కోరారు.

జిల్లా ఎస్పీ ప్రకటన

భీమవరం: ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలులో ఉన్నందున సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేసినట్టు జిల్లా ఎస్పీ అజిత ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహాలకు ముసుగు వేయొద్దు

పాలకొల్లు సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల్లో నిబంధనల పేరుతో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ముసుగువేయడం అవమానించడమేనని పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి పేరున అంబేడ్కర్ విగ్రహాలకు ముసుగులు వేస్తే సహించేది లేదన్నారు. ఇది భారత రాజ్యాంగ నిర్మాతకు తీవ్ర అవమానమని అన్నారు. దీనిపై కలెక్టర్ నిర్ణయం తీసుకుని ఆదేశాలు జారీచేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ ఎన్నికల్లో దళితుల అభివృద్ధికి కోసం పనిచేసే పార్టీలకే మద్దతు ఇస్తామని ప్రకటించారు. కె.వీరాస్వామి, జి.పెద్దిరాజు, నక్కా వేద వ్యాస్, పి.బాలకృష్ణ, దేవ రాజేష్ పాల్గొన్నారు.

ప్రగతి దారులు



పెనుగొండ - మార్టేరు రోడ్డు

3 కిలోమీటర్లు | రూ.4 కోట్ల వ్యయం



కవిటం - గుమ్ములూరు రోడ్డు

7 కిలోమీటర్లు | రూ.3 కోట్ల వ్యయం



కృష్ణాయపాలెం - నందమూరు రోడ్డు

9 కిలోమీటర్లు | రూ.6 కోట్ల వ్యయం

రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. గత టీడీపీ హయాంలో నాణ్యతాలేమితో నిర్మించిన పలు రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారగా వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంది. తరచూ మరమ్మతులకు గురవుతున్న రహదారులను పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లుగా తీర్చిదిద్దింది. ఇలా జిల్లాలో రాష్ట్ర, జిల్లా, పల్లె రహదారులను నిర్మించింది. ఇప్పటికే పలు రోడ్ల నిర్మాణాలు పూర్తికాగా మిగిలిన చోట్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లాలో గత 58 నెలల కాలంలో సుమారు 3,512 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించారు. ఇందుకు గాను వందలాది కోట్ల రూపాయలను వెచ్చించారు. అంతటా రహదారులను అభివృద్ధి చేయడంతో ప్రయాణం సుఖవంతంగా సాగుతోంది. దీనిపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– భీమవరం

అభివృద్ధికి బాటలు

- ఆర్‌అండ్‌బీ రోడ్లకు మహర్దశ
- రాష్ట్ర, జిల్లా రహదారులతో పాటు పల్లె రోడ్లకు మోక్షం
- సుమారు 3,512 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం
- హాయిగా సాగుతున్న ప్రయాణం



పెంటపాడు - వెంకట్రామన్నగూడెం రోడ్డు | 16 కిలోమీటర్లు | రూ.15 కోట్ల వ్యయం



అత్తిలి - కోరుకొల్లు రోడ్డు

14 కిలోమీటర్లు | రూ.32 కోట్ల వ్యయం



మంచిలి - మోగల్లు రోడ్డు

5 కిలోమీటర్లు | రూ.2.50 కోట్ల వ్యయం



మార్టేరు - అత్తిలి రోడ్డు

14 కిలోమీటర్లు | రూ. 25 కోట్ల వ్యయం



భీమవరం మండలంలో లోసరి రోడ్డు

11 కిలోమీటర్లు | రూ.7 కోట్ల వ్యయం



పెనుమంట్ర - వీరవాసరం రోడ్డు

300 మీటర్లు | రూ. 1 కోటి వ్యయం



ఆకివీడు - సిద్ధాపురం రోడ్డు

6 కిలోమీటర్లు | రూ.40 లక్షల వ్యయం

సంక్షేమం అమలులో నూతన ఒరవడి

- ఎన్నికల్లో విజయమే లక్ష్యం
- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: సంక్షేమ పథకాల అమలులో నూతన ఒరవడితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనంపై జగన్ మార్కు వేశారని, బీసీలకు అగ్రతాంబూలం ఇస్తూ, చెప్పారంటే చేస్తాడంతే అన్న విశ్వాసాన్ని ప్రజల్లో నింపారని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలతో సంక్షేమాన్ని అందిస్తూ దేశంలోనే నూతన ఒరవడికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా అలుపు లేకుండా శ్రమించి విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలను సరిచూసుకుని ఓటర్ల చేర్పులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సిద్ధం వంటి సభల నిర్వహణను దేశంలోని పలు పార్టీలు అనుసరిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జగన్ అమలుచేస్తున్న పథకాలు, పక్క రాష్ట్రాల్లోని మేనిఫెస్టోలో అంశాలను కాపీ చేసి చంద్రబాబు తమవిగా చెప్పుకుంటున్నారన్నారు. పార్టీ శ్రేణులు సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతి ఇంటికీ వివరించాలన్నారు. పవన్ కల్యాణ్ వంటి వారి పట్ల యువత తప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా అవగాహన కల్పించాలన్నారు. పవన్‌కల్యాణ్ పొరపాటు విధానాలతో జనసేనను దిగజార్చుకున్నారని విమర్శించారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ. చిత్రంలో ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

బీసీలకు జగన్‌తోనే గుర్తింపు

రాష్ట్రంలో బీసీ వర్గాలకు గుర్తింపు ఇచ్చింది సీఎం జగన్ మాత్రమే అని, 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి ఆయా వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేశారని నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కూటమిగా చెప్పుకొనే పార్టీలకు అభ్యర్థులు లేక పక్క పార్టీల నుంచి వచ్చిన వారికి కండువాలు కప్పి అభ్యర్థులుగా ప్రకటిస్తున్నారన్నారు. ఓట్ల కోసం కాకుండా సీఎం జగన్ జనం కోసం పనిచేస్తున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరు

వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని, ఎదురొచ్చిన వారు సునామీలో కొట్టుకుపోతారని అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ అన్నారు. ఉమ్మడి పశ్చిమలో రెండు ఎంపీ స్థానాలనూ సీఎం జగన్ బీసీలకు కేటాయించారన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని డివిజన్ స్థాయి కేంద్రంగా మార్చిన వ్యక్తి కొట్టు సత్యనారాయణ అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, కన్వీనర్లు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, ఏఎంసీ వైస్‌చైర్మన్ చోడగిరి చినబాబు, పట్టణ మహిళా కమిటీ అధ్యక్షురాలు బోణం విజయనిర్మల, యూత్ ప్రెసిడెంటు చిటికెన ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు తెన్నేటి జగ్జీవన్, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియ

కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, ప్రతి ఓటరును భాగస్వామిని చేయడానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణ ఎన్నికల సన్నద్ధత, నిర్వహణకు జిల్లాలో చేపడుతున్న కార్యాచరణను వివరించారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 14,61,337 కాగా పురుషులు 7,16,955, మహిళలు 7,44,308, థర్డ్ జెండర్ 74 మంది ఉన్నారన్నారు. జిల్లాలో 1,463 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామని, పీఓ, ఏపీఓ, ఇతర సిబ్బందిని 9,681 మందిని నియమించామన్నారు. సుమారు 1.09 లక్షల ఎపిక్ కార్డులను పోస్టల్ ద్వారా పంపిణీ చేస్తామన్నారు. సీ–విజిల్ యాప్, సువిధ యాప్, ఓటర్ హెల్ప్ లైన్ యాప్, కేవైసీ యాప్‌లను ఉపయోగించనున్నట్టు చెప్పారు. మూడు బెటాలియన్లను వినియోగిస్తామని, అదనంగా 1,500 మంది పోలీస్ సిబ్బందికి కేటాయించామన్నారు. భీమవరం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కాల్ సెంటర్ 08816–299616, ఈఎస్ ఎంఎస్, సువిధ, ఎన్‌కోర్ కోసం 08816 299617 నంబర్‌ను ఏర్పాటుచేశామన్నారు. భీమవరం విష్ణు కాలేజీలో నరసాపురం, ఆచంట, పాలకొల్లు, తణుకు నియోజకవర్గాలు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

పక్కాగా కోడ్

జిల్లావ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందని, పక్కాగా కోడ్ అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఎన్నికల కమిషన్ నుంచి కోడ్ అమలు తర్వాత 24 గంటలు, 48 గంటల్లో ఏం చేయాలనే దానిపై సూచనలు ఉన్నాయని, తప్పక అమలు చేయాలని, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

కట్టుదిట్టంగా అమలు

ఎన్నికల ప్రవర్తనా నియామవళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్లను ఆదేశించారు.

క్లుప్తంగా

బీచ్‌లో సందర్శకుల సందడి



కేపీ పాలెంలో సేద తీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: మండలంలోని కేపీ పాలెం, పేరు పాలెం బీచ్‌లు సందర్శకుల రాకతో సందడిగా మారాయి. ఆదివారం పాఠశాలలకు, కాలేజీలకు, కార్యాలయాలకు సెలవు రోజు కావడంతో మధ్యాహ్నం నుంచి సందర్శకుల సంఖ్య క్రమంగా పెరిగింది. వేసవిని తలపించేలా ఎండ కాయడంతో సందర్శకులు సముద్ర స్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని ఆలయాలను దర్శించుకున్నారు.

కన్న కూతురిపై తండ్రి అత్యాచార యత్నం

ఆగిరిపల్లి: మండలంలోని కొమ్మూరులో కన్న కూతురిపై తండ్రి అత్యాచారయత్నం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. బాలిక చదువు మానేసి ఇంట్లో ఉంటోంది. శనివారం రాత్రి మద్యం మత్తులో తండ్రి ఇంటికి రాగా, ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న కుమార్తెపై అత్యాచారానికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో ఇంటి పక్కన చుట్టుపక్కల వారు రావడంతో తండ్రి పారిపోయాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

కైకలూరు: పట్టణంలోని విద్యాంజలి కళాశాల సమీపంలో గట్టు వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రాజు ఆదివారం చెప్పారు. నిందితుల నుంచి రూ.8,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



సుకన్య మృతదేహం

కొయ్యలగూడెం: బైక్‌పై భర్త, కుమారుడితో కలిసి వెళుతుండగా, వెనుక నుంచి గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో ఓ వివాహిత అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఉద్దగిరి సుకన్య (26) ద్విచక్ర వాహనంపై తన భర్త, కుమారుడితో జాతీయ రహదారిలో ఆదివారం రాత్రి కొయ్యలగూడెం వైపు వస్తోంది. బయ్యనగూడెం సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని లారీ సుకన్య తలమీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో భర్త, కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈబీసీ నేస్తం.. మహిళల ప్రగతికి చిహ్నం

- ఉన్నత వర్గాల్లోని పేద మహిళలకు వరంగా ఈబీసీ నేస్తం
- ఏడాదికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం
- మొత్తం 3 విడతల్లో రూ.45 వేలు సాయం అందించిన ప్రభుత్వం
- జిల్లాలో 54,954 మంది లబ్ధిదారులకు రూ.82.43 కోట్ల లబ్ధి



భీమవరం కలెక్టరేట్‌లో ఈ బీసీ నేస్తం లబ్ధిదారులకు మూడో విడత ఆర్థిక సాయం చెక్కులు అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ (ఫైల్)

భీమవరం (ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో వెనుకబడిన వర్గాలతో పాటు ఉన్నత వర్గాల్లోని పేద మహిళలను సైతం సంక్షేమ పథకాలతో ఆదుకున్నారు. ఉన్నత వర్గాలైన క్షత్రియ, కమ్మ, రెడ్డి తదితర వర్గాలలోని 45 ఏళ్లు దాటిన పేద మహిళలకు ఈబీసీ నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేల చొప్పున మూడు విడతల్లో రూ.45 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో ఉన్నత వర్గాలలోని పేద మహిళలు చిన్నపాటి వ్యాపారాలు ప్రారంభించడం, అప్పటికే ఉన్న వ్యాపారాలకు ఈ ఆర్థిక సహాయం ద్వారా మరింత అభివృద్ధి చేసుకున్నారు. అలాగే కుటుంబ అవసరాలకు సద్వినియోగం చేసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆర్థిక సహాయం అందించడంపై ఉన్నత వర్గాల్లోని పేద మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఉన్నత వర్గాలలోని పేద వారికి కూడా సంక్షేమ పథకాలు అమలు చేసి సీఎం వైఎస్ జగన్ ఆర్థిక చేయూత అందించారని సంతోషంగా చెబుతున్నారు.

జిల్లాలో ఈ బీసీ నేస్తం కోసం 82.42 కోట్లు ఖర్చు

జిల్లాలో 54,954 మందికి ఏడాదికి రూ:15 వేల చొప్పున మూడు విడతల్లో ఒక్కొక్క లబ్ధిదారుకు రూ.45 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించింది. మూడు విడతల్లో మొత్తం రూ.82.43 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇటీవల మూడో విడత ఈబీసీ నేస్తం లబ్ధిని ఆయా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. మూడో విడతలో జిల్లాలో 13,024 మందికి రూ.15 వేలు చొప్పున రూ.19.53 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. మొదటి విడత 28,470 మంది లబ్ధిదారులకు రూ.42.70 కోట్లు, రెండో విడతలో రూ.13,460 మందికి రూ.20.19 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

వ్యాపార అభివృద్ధికి ఉపయోగించా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేద మహిళల కోసం అమలు చేసిన ఈ బీసీ నేస్తం పథకం ద్వారా నాకు ఏడాదికి రూ.15 వేల చొప్పున మూడు విడతల్లో రూ.45 వేలు ఆర్థిక సాయం అందింది. ప్రభుత్వం అందించిన ఈ సొమ్మును నేను నడుపుకుంటున్న కిరాణా వ్యాపార అభివృద్ధికి ఉపయోగించుకున్నాను. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడం సంతోషంగా ఉంది. – ఐ.ఉషారాణి, ఈబీసీ నేస్తం లబ్ధిదారు (ఆర్యవైశ్య)

కిరాణా వ్యాపారం ప్రారంభించా



మాది భీమవరం 35వ వార్డు. ఈ బీసీ పథకం ద్వారా నాకు ఏడాదికి రూ.15వేల ఆర్థిక సాయం అందింది. ఈ సొమ్ముతో నేను కిరాణా, కొబ్బరిబొండాల వ్యాపారం ప్రారంభించా. ప్రతి ఏడాది ఆర్థిక సాయాన్ని ఈ వ్యాపారానికే ఉపయోగించా. ఉన్నత వర్గాల్లోని పేద మహిళలకు ప్రభుత్వం అమలు చేసిన ఈ బీసీ నేస్తం పథకం ఎంతో ఉపయోగపడింది. – పచ్చమట్ల పార్వతి, ఈబీసీ నేస్తం లబ్ధిదారు (క్షత్రియ)

ఈబీసీ నేస్తం మూడో విడత సాయం వివరాలు

మండలం	లబ్ధిదారులు	నిధులు(రూ.లక్షల్లో)
ఆచంట	396	59.40
పెనుగొండ	428	64.20
పెనుమంట్ర	1,275	191.25
పోడూరు	313	46.95
భీమవరం	1111	166.65
గణపవరం	607	91.05
వీరవాసరం	206	30.90
మొగల్తూరు	145	21.75
నరసాపురం	1316	47.40
యలమంచిలి	442	66.30
పాలకొల్లు	636	95.40
పోడూరు	267	40.05
పెంటపాడు	561	84.15
తాడేపల్లిగూడెం	1,321	198.15
అత్తిలి	543	81.45
ఇరగవరం	635	95.25
తణుకు	1,858	278.70
ఆకివీడు	379	56.85
కాళ్ల	443	66.45
పాలకోడేరు	575	86.25
ఉండి	567	85.05

‘కొట్టు’ విజయానికి పాటుపడతాం

- ఇంటి వద్ద ఉన్న వారిని తీసుకెళ్లి జనసేన కండువాలు వేయించారు
- మేము వైఎస్సార్ సీపీలోనే ఉన్నాం
- స్పష్టం చేసిన మోదుగగుంట సర్పంచ్, ఎంపీటీసీలు



కొట్టు సత్యనారాయణను కలిసిన మోదుగగుంట సర్పంచ్ సత్యవతి, ఎంపీటీసీ విజయదుర్గ

తాడేపల్లిగూడెం రూరల్: రాబోయే ఎన్నికల్లో మంత్రి కొట్టు సత్యనారాయణ విజయానికి కృషి చేస్తామని మోదుగగుంట సర్పంచ్ కట్టా సత్యవతి, ఎంపీటీసీ సభ్యులు దండుబోయిన విజయదుర్గ చెప్పారు. ఆదివారం తాడేపల్లిగూడెంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను వారు కలిశారు. ఈ సందర్భంగా కట్టా సత్యవతి, దండుబోయిన విజయదుర్గ మాట్లాడుతూ ఇంటి వద్ద ఉన్న తమను తీసుకెళ్లి జనసేన కండువాలు వేయించారని వారు తీవ్రంగా ఖండించారు. తమ భర్తలు కూడా జనసేన పార్టీలో చేరినట్లు ప్రసార మాధ్యమాల్లో వచ్చాయని వాపోయారు. తాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నామని స్పష్టం చేశారు. తమ గ్రామ అభివృద్ధికి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఎంతగానో సహకరించారని గుర్తు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

పెదవేగి: రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. చక్రాయగూడెంకు చెందిన బోట్ల వీరమ్మ శనివారం రాత్రి గ్రామంలో ఉన్న ఏలూరు – జంగారెడ్డిగూడెం రహదారిని దాటుతోంది. ఇంతలో జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఆమెను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నడిపల్లిలో చోరీ

పెదవేగి: నడిపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగి బంగారు ఆభరణాలు, వెండి, వస్తువులు అపహరణకు గురయ్యాయి. ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మేకా రమేష్ కుటుంబసభ్యులతో కలిసి వారం క్రితం హైదరాబాద్ వెళ్లారు. అయితే ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన స్థానికులు శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో ఉన్న రమేష్‌కు సమాచారం అందించారు. దీంతో ఆదివారం ఉదయానికి నడిపల్లి చేరుకున్న రమేష్ ఇంట్లో నాలుగు కిలోల బరువైన మూడు వెండి పళ్లాలు, ఐదు కాసుల బంగారు ఆభరణాలు, రూ.ఐదు వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కోడ్ కూసింది.. ముసుగు పడింది

- ఎన్నికల షెడ్యూల్ విడుదలతో అమలులోకి కోడ్
- అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాగం
- నాయకుల విగ్రహాలకు ముసుగు, ఫొటోల తొలగింపు



తణుకు నరేంద్ర సెంటర్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి వేసిన ముసుగు



రాజీవ్‌గాంధీ చౌక్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి వేసిన ముసుగు



సీతారామపురంలో పార్టీ హోర్డింగ్ తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీవో తదితరులు

తణుకు: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో ఉన్న రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నేతల ఫొటోలను తొలగించారు. వివిధ ప్రాంతాల్లో దర్శనమిస్తున్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరగకుండా జాగ్రత్తలలో నిమగ్నమయ్యారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాలిటీతోపాటు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో పలు ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఇప్పటికే ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తనిఖీల సమ యాల్లో పోలీసులకు సహరించాలని, ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరు నిబంధనలు పాటించాలన్నారు.

ముందస్తు అనుమతులు తప్పనిసరి

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీల ప్రచార వాహనాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సిన పరిస్థితి. తణుకు మున్సిపల్ పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పలు కూడళ్లలో నేతల విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు ఫ్లెక్సీలను తొలగించారు. ఇప్పటికే భారీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆయా పార్టీల నాయకులు తొలగించుకోవాలని అధికారులు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో దుకాణాలపై పెట్టిన హోర్డింగులు తీసేయాలని సూచించారు.

90 రోజుల పాటు అమలులో కోడ్

సుమారు 90 రోజుల పాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. షెడ్యూల్ విడుదల అయిన శనివారం నుంచి ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు 90 రోజుల పాటు కోడ్ వర్తించనుంది. కోడ్ అమల్లోకి రాగానే అన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్లు తొలగించారు.

నియోజకవర్గంలో ఓటర్లు ఇలా...

తణుకు నియోజకవర్గంలో శనివారం నాటికి ఓటర్ల సంఖ్య 2,33,266 కు చేరుకుంది. పోలింగ్ కేంద్రాలు 233 ఉన్నాయి. ఇక ఓట్ల తొలగింపు, బదిలీ, చేర్పులు, మార్పులకు అవకాశం లేదు. ఈ మేరకు శనివారం నుంచి ఈఆర్వో నెట్‌లో ఈ ప్రక్రియ నిలిపివేశారు. కొత్త ఓటు నమోదుకు ఫారం-6 దాఖలు చేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. నామినేషన్ల ఆఖరి తేదీ పది రోజుల ముందుకు వరకు దాఖలైన ఫారం-6 దరఖాస్తులను పరిష్కరించి, ఓటు హక్కు కల్పించనున్నారు. ఏప్రిల్ 15 వరకు కొత్తగా ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి ఓటు హక్కు కల్పిస్తారు.

పార్టీల ఫ్లెక్సీలు, గుర్తుల తొలగింపు

నరసాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించడం, పార్టీ గుర్తులపై తెల్లరంగు పూయడం, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సీతారామపురం, చిట్టవరం గ్రామాల్లో కోడ్ అమలు తీరును ఎంపీడీవో ఎంపీ రమణారావు పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికలు నిస్పక్షపాతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. తాము ఏరాజకీయ పార్టీకి అనుకూలం, వ్యతిరేకం కాదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

కిటకిటలాడిన పెద్దింట్లమ్మ ఆలయం



అమ్మవారి దర్శనానికి క్యూలో వెళుతున్న భక్తులు



కొల్లేటికోటి పెద్దింట్లమ్మ తల్లి

కై కలూరు: పెద్దింట్లమ్మ నామస్మరణతో కొల్లేటి కోట మార్మోగింది. ఆదివారం సెలవు దినం కావడంతో సమీప జిల్లాల నుంచి 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సమీప కోనేరులో స్నానాలు ఆచరించిన భక్తులు అమ్మకు వేడి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కేశఖండనశాల వద్ద రద్దీ కనిపించింది. పలువురు జల్లు స్నానాలు ఆచరించారు. భక్తులు వంటలు చేసుకోడానికి దేవదాయశాఖ టెంట్లను ఏర్పాటు చేసింది. విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాదం, మజ్జిగను ఆర్జమూరుకు చెందిన సింగలూరి అంజయ్య, వాటర్ ప్యాకెట్లు, పసిపిల్లలకు పాలు పంపిణీ గణపవరానికి చెందిన పిన్నమరాజు వెంకట సీతారామరాజు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిల్లరకొట్టు చిట్టెమ్మ సాంఘిక నాటకం ఆకట్టుకుంది. అమ్మవారికి షష్ట్యావరణ కలశార్చన, షష్ట్యావరణపూజ, విశేషార్చన, పుష్పాలంకరణ ధూపసేవ, బాలభోగం, సాయంత్రం పంచ హారతులును అర్చకులు అందించారు. అమ్మవార్లకు వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదానికి విజయవాడకు చెందిన కొయ్య వెంకటేశ్వరరావు దంపతులు దాతలుగా వ్యవహరించారు. రూరల్ సర్కిల్ సీఐ బి.కృష్ణకుమార్, రూరల్ ఎస్సై టి.రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

21న అమ్మవారి కల్యాణం

కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో కీలకఘట్టమైన జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామివార్ల కల్యాణం ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కేవీ గోపాలరావు చెప్పారు. అదే రోజున ప్రభల బండి, బోనాల గ్రామోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున విచ్చేయాలని కోరారు.

దేవాలయాల జీర్ణోద్ధరణ.. దైవకార్యం

- దేవాలయాల జీర్ణోద్ధరణ పవిత్రమైన కార్యక్రమం
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ కృష్ణమోహన్
- దువ్వలో వేదశాస్త్ర పండిత సన్మాన సభ



దువ్వ సభలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్

తణుకు టౌన్: పురాతన దేవాలయాలను జీర్ణోద్ధరణ చేయడం చాలా పవిత్రమైన కార్యమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ కృష్ణమోహన్ రావు అన్నారు. ఆదివారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వేంచేసియున్న శ్రీ పర్వతవర్ధిని శ్రీనాగేశ్వరస్వామి ఆలయంలో పరాశర వైదికాగమవేద శాస్త్ర పరిషత్ 15వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వేదశాస్త్ర పండిత సన్మాన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జస్టిస్ కృష్ణమోహన్‌కు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం జరిగిన వేద శాస్త్ర పండితుల సన్మాన సభలో జస్టిస్ పాల్గొని మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు వేదమే మూలమని చెప్పారు. వేద విద్యను ప్రోత్సాహించాలని కోరారు. సమాజంలో వివిధ రంగాలలో ఉన్నత స్థానాలకు చేరిన వారు పేదల అభివృద్ధికి కూడా తోడ్పాటును అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి గుల్లపల్లి రామచంద్ర ఘనాపాఠి అధ్యక్షత వహించారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది చల్లా ధనుంజయ్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి పురుషోత్తంకుమార్ చింతలపూడి, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి, సీనియర్ సివిల్ జడ్జి సత్యకృష్ణ లత, సెకండ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నాగరాజు, స్పెషల్ మేజిస్ట్రేట్ పీ చిరంజీవి, చింతపల్లి ఆంజనేయ ఘనాపాఠి, అన్నదానం చిదంబరం శాస్త్రి, దోర్బల ప్రభాకరశర్మ, విశ్వనాథం గోపాలశాస్త్రి, ఈవని ఘనాపాఠి, జంధ్యాల జగన్నాథ శాస్త్రి, కామర్సు రామారావు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఎంపీపీ రుద్ర ధనరాజు, దండు కృష్ణంరాజు, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, ఈవో పీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన వేద పండితులను ఘనంగా సత్కరించారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి వ్యక్తి హల్‌చల్



తణుకులో వాటర్ ట్యాంకు ఎక్కిన వ్యక్తికి సర్దిచెబుతున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది

తణుకు: పైడిపర్రులో వాటర్ ట్యాంక్ ఎక్కి ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. చివరికి పోలీసులు, ఫైర్ సిబ్బంది సర్దిచెప్పడంతో కిందకి దిగి వచ్చాడు. వివరాలిలా ఉన్నాయి. తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన యరమాటి సత్యనారాయణ పరంజా కట్టే పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొమరవరం గ్రామానికి చెందిన మేస్త్రి అల్లాడి దుర్గారావు వద్ద ఏడేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తాడేపల్లిగూడెంలో పని కోసం వెళ్లిన సత్యనారాయణ మద్యం తాగి అక్కడ భవన యజమానితో ఘర్షణకు దిగాడు. దీంతో మేస్త్రి దుర్గారావుకు యజమాని ఫోన్ చేసి చెప్పడంతో సత్యనారాయణను మందలించారు. భార్య సుబ్బలక్ష్మికి సైతం విషయం చెప్పడంతో మనస్తాపం చెందిన సత్యనారాయణ తణుకు చేరుకుని రూరల్ పోలీసు స్టేషన్ వద్ద వాటర్ ట్యాంక్ ఎక్కాడు. దుర్గారావు తనను దుర్భాషలాడాడని ఆరోపిస్తూ వాటర్ ట్యాంక్ ఎక్కడంతో ఉత్కంఠ నెలకొంది. చివరికి దుర్గారావుతోపాటు భార్య సుబ్బలక్ష్మిని రప్పించి కిందికి వస్తే సమస్య పరిష్కరిస్తామని పోలీసులు, ఫైర్ సిబ్బంది హామీ ఇవ్వడంతో రెండు గంటల అనంతరం కిందికి దిగాడు. అయితే సత్యనారాయణ 2021లో సైతం ఇదే వాటర్ ట్యాంకు ఎక్కి హల్‌చల్ చేయడంతో అతనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు.

వాసవీ మాతను దర్శించిన మహారాష్ట్ర భక్తులు



వాసవీ శాంతి ధాంలో మహారాష్ట్ర భక్తులు

పెనుగొండ: మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన భక్తులు వాసవీ మాతను దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి వాసవీ శాంతి ధాంలో మరకత శిల వాసవీ మాతకు అభిషేకాలు, అర్చనలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన వాసవీ మాత పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు.

నెరవేరిన సొంతింటి కల

- 15,874 మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఇంటి నిర్మాణానికీ సాయం అందించిన సీఎం జగనన్న
- సంపూర్ణ హక్కులతో రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాల అందజేత
- జగన్ చెప్పారంటే.. చేస్తారంతే అంటున్న లబ్ధిదారులు



తణుకు సభలో లబ్ధిదారుకు రిజిస్ట్రేషన్ ఇంటి పత్రాన్ని అందిస్తున్న మంత్రి కారుమూరి, ఎంపీ అభ్యర్థి ఉమాబాల, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ (ఫైల్)

తణుకు అర్బన్: ప్రజాసంకల్పయాత్రలో పేదలకు సొంతింటి కల నెరవేరుస్తానని జగనన్న మాట ఇచ్చారు. చెప్పినట్లుగానే అధికారంలోకి రాగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు – పేదలకు ఇళ్లు కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి సైతం రూ.1.80 లక్షల చొప్పున నిధులు అందించారు. అంతేకాకుండా ఆ ఇళ్లపై లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ పట్టాలను సైతం అందిస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో మగ్గిపోయిన పేదలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నీరాజనాలు పలుకుతున్నారు. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని గొంతెత్తి చెబుతున్నారు. గతంలో ఏ సీఎం చేయాని సాహసాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారని, రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఎకరాలు భూమి కొనుగోలు చేసి ఇళ్లను నిర్మించి ఇచ్చా రంటూ హర్షాతిరేఖాలు వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే చాలా మంది లబ్ధిదారులు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని నివసిస్తున్నారు.

చెప్పినట్లుగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్

ఈనెల 7వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజాసంకల్పయాత్రలో వైఎస్ జగన్ చెప్పిన ప్రకారం జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాను రిజిస్ట్రేషన్ చేయించి డాక్యుమెంట్‌గా లబ్ధిదారు చేతిలో పెడతానన్న మాటను నిలబెట్టుకున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ల పద్ధతిని వ్యతిరేకించినప్పటికీ ఇళ్లు నిర్మాణం పూర్తయిన వారితోపాటు కట్టుకోలేకపోయిన వారికి కూడా సచివాలయ వ్యవస్థ ద్వారా సేకరించిన వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించి డాక్యుమెంట్‌లను లబ్ధిదారుల చేతికి అందించారు. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



తణుకులో రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలతో లబ్ధిదారులు

నియోజకవర్గంలో రూ. 162.07 కోట్లతో

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 120 లేఅవుట్‌లలో రూ.162.07 కోట్లతో 349.82ఎకరాల భూమి కొనుగోలుచేసి 15874 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు కేటాయించి తాజాగా ఇంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లు అందజేశారు.

మండలం	భూమి ఎకరాల్లో	లేఅవుట్లు	ప్లాట్లు	ఖర్చు
తణుకు అర్బన్	144.34	5	7867	రూ.79.87 కోట్లు
తణుకు	90.10	25	3857	రూ.55.09 కోట్లు
అత్తిలి	59.23	48	2151	రూ.13.83 కోట్లు
ఇరగవరం	56.15	42	1999	రూ.13,25 కోట్లు

జగనన్న కాలనీలు చరిత్రాత్మకం



జగనన్న కాలనీల పేరిట తణుకు నియోజకవర్గంలో నిర్మితమైన ఊర్లు చరిత్రాత్మకం. జగనన్న స్ఫూర్తితో తణుకులో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి లబ్ధిదారులకు సంబంధించి స్థలం మంజూరులో కులం, మతం, పార్టీ భేదాల్లేకుండా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయించి నేడు వారందరికీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లు అందించారు.

– పైబోయిన సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు

గుండెల్లో గుడి కట్టారు



సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి లబ్ధిదారులు తమ గుండెల్లో గుడి కట్టారు. గతంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రమే ఇంటి స్థలాలు అందజేశారు. జగనన్న ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణం కూడా చేసి ఇవ్వడమే కాకుండా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను ఇవ్వడాన్ని లబ్ధిదారులు స్వాగతిస్తున్నారు.

– ఎం.ఝాన్సీ లారెన్స్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి, తణుకు

జగనన్నకు రుణపడి ఉంటాం



చాలా ఏళ్లుగా తణుకులో నివసిస్తున్న మాకు ఏ ప్రభుత్వం కూడా ఇంటి స్థలం ఇవ్వలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన ప్రకారం ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా ఇంటి నిర్మాణానికి సాయం చేశారు. పైడిపర్రులో ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న మాకు తాజాగా ఇంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను సైతం అందచేశారు. మాకింత మేలు చేసిన జగనన్నకు మేమంతా రుణపడిఉంటాము.

– బోనం స్వాతి, జగనన్న కాలనీ లబ్ధిదారు, పైడిపర్రు

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఇచ్చారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌గా ఇస్తానని ఇచ్చిన హామీని తూ.చ. తప్పకుండా నెరవేర్చారు. గతంలో ఇంటి పట్టాను మాత్రమే ఇచ్చేవారు.. కానీ నేడు జగనన్న ప్రభుత్వంలో మాత్రం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. గతంలో మాదిరిగా కాకుండా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చింది జగనన్న ప్రభుత్వం.

– అల్లం అన్నపూర్ణ, జగనన్న కాలనీ లబ్ధిదారు, తణుకు

క్లుప్తంగా

137 మందికి కంటి పరీక్షలు



లయన్స్ క్లబ్‌చే నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో వంగవండు రామోహన్‌రావు అధ్యక్షతన ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వారిచే దాత పదంకుమార్‌గుప్తా సాయంతో 137 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 24 మందిని కంటి ఆపరేషన్లు నిమిత్తం నిడదవోలు పంపారు. 26 మందికి ఉచితంగా కళ్లజోళ్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. డి.సోమసుందర్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, దాట్ల లక్ష్మీపతిరాజు, కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సక్షం సేవలు అభినందనీయం



సక్షం సమావేశంలో ట్రై సైకిళ్లు అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): సక్షం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సక్షం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆదివారం పట్టణంలోని ఉమన్స్ కళాశాలలో నిర్వహించారు. సక్షం రాష్ట్ర సంఘటనా ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమోహన్, జిల్లా అధ్యక్షుడు కేఎస్ అప్పారావు ఆధ్వర్యంలో సంఘ సమస్యలను చర్చించారు. దివ్యాంగులు వీరమళ్ళ, సూర్యచంద్రరావు, అడపా సూరిబాబులకు ఉచితంగా ట్రై సైకిళ్లు అందజేశారు.

ఎన్నికల శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న కలెక్టర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ఆదివారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహించారు. తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గ పరిధిలోని ఐటీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, వీవీటీ, వీఎస్‌టీ, డీఎల్ఎంటీ ఏఈఓ, అకౌంట్ తదితర అధికారులకు ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం ద్వారా ఉద్యోగాలు

భీమవరం: నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు అలవర్చుకోవడం ద్వారా ఉద్యోగాలు సాధించవచ్చని శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ అన్నారు. విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వార్షికోత్సవాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సొసైటీలో 10 ఏళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని సత్కరించారు. అనంతరం జేఎన్‌టీయూకే పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేణు, కళాశాల డైరెక్టర్ దశిక సూర్యనారాయణ, అడ్మిన్ ప్రసాదరాజు, ఏజీఎం రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

గోరీలగుంట అభివృద్ధి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం వెనుక భాగంలో ఉన్న గోరీలగుంట స్థలాన్ని అభివృద్ధి చేయడానికి పురావస్తు శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఆదివారం గోరీలగుంట ప్రాంతాన్ని పురావస్తు శాఖ అధికారులు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిమ్మరాజు మాట్లాడుతూ గతంలో డచ్ వారు మన ప్రాంతాన్ని పరిపాలించేవారు. అప్పుడు వారి సమాధులు ఇక్కడ ఉండేవి. వాటిని తవ్వకాలు చేసినప్పుడు వచ్చిన కొన్ని అవశేషాలను విజయవాడ బాపు మ్యూజియంలో నిక్షిప్తపరచామన్నారు. ఈ ప్రాంతాన్ని చారిత్రక ప్రదేశంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పురావస్తు శాఖ దీనిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా ఈ ప్రాంతాన్ని పరిశుభ్రం చేయించాలని మునిసిపల్ కార్యాలయానికి దరఖాస్తు చేసినట్లు తెలిపారు. అలాగే ఈ ప్రాంతం మొత్తం 35 సెంట్లు భూమి ఉండాలన్నారు. చాలా వరకూ ఈ స్థలం అన్యాక్రాంతమైందని తెలిసి ఈ స్థలాన్ని కొలత కొలిచి అప్పగించాలని తహసీల్దార్ కార్యాలయానికి దరఖాస్తు చేశామని అన్నారు. ఈ స్థలాన్ని శుభ్రం చేసి ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తామన్నారు. సమాచార హక్కు సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ దుర్గాప్రసాద్ అన్యాక్రాంతమవుతున్న ఈ గోరీలగుంట ప్రాంతాన్ని పరిశీలించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని పురావస్తు శాఖ అధికారులకు ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టారని తెలుస్తుంది.

వృద్ధులకు ఉచిత వైద్యసేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకులోని వివిధ ప్రాంతాల్లోని వృద్ధులకు ఇంటి వద్దనే వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, తణుకు పాతూరు, పైడిపర్రు, తదితర ప్రాంతాల్లోని వృద్ధులకు వైద్యపరీక్షలు, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి వారికి తగు ఆరోగ్య సూచనలు, సలహాలను అందించారు. అసోసియేషన్ సభ్యులు వేల్పూరుకు చెందిన పుట్టా వెంకట చక్రధరరావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కవి బ్రహ్మయ్యకు సాహితీ పురస్కారం



బ్రహ్మయ్యను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: తనలో చెలరేగిన అనేక బావ సంఘర్షణలకు అక్షరరూపం ద్వారా వచ్చిన కవిత్వాలను ఆదరించిన పాఠకులకు, సాహితీ వేత్తలకు ప్రముఖ కవి కొప్పర్తి వేంకట రమణమూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు భవనంలో రసధుని ఆధ్వర్యంలో పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక సాహితీ పురస్కార సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొప్పర్తి వెంకట రమణమూర్తికి పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక సాహితీ పురస్కారం అందించారు. కొప్పర్తి మాట్లాడుతూ సాహిత్య రంగంలో తాను చేసిన సేవలను గుర్తించి తనకు ఈ పురస్కారం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. రసధుని సభ్యులు కొట్టి భాస్కరరావు, పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, యర్రంశెట్టి వెంకటరత్నం, పెనుమాక రామ్మోహనరావు పాల్గొన్నారు.

స్వప్రయోజనాల కోసమే పొత్తు

పెనుగొండ: రాష్ట్ర ప్రయోజనాలకు కాకుండా టీడీపీ, జనసేన, బీజేపీలు స్వప్రయోజనాలకే పొత్తు పెట్టుకున్నాయని రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టరు కొవ్వూరి వేణుమాధవ రెడ్డి విమర్శించారు. ఆదివారం పెనుగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు ఒకరిన్ని ఒకరు తిట్టుకుంటూ తన్నుకొన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అడుగు పెట్టనివ్వనంటూ సాక్షాత్తూ కేంద్ర హోంమంత్రిపై రాళ్లు వేయించిన ఘన చరిత్ర చంద్రబాబుదని, రెండు పాచిపోయిన లడ్డూలు ఇచ్చారంటూ దేశ ప్రధానిని విమర్శించిన నిలకడలేని వ్యక్తిత్వం పవన్‌దని విమర్శించారు. వీరికి ప్రజల సంక్షేమం అవసరం లేదన్నారు. అధికారం కోసం అనైతిక పొత్తులతో కలిసారన్నారు. దోచుకోవడం.. పంచుకోవడం.. దాచుకోవడం తప్ప వీరికి రాష్ట్ర అభివృద్ధి అవసరం లేదన్నారు. ఎంతమంది కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీని ఓడించలేరని, ప్రజలంతా సీఎం జగన్‌కు అండగా ఉన్నారని అన్నారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం



నర్సాపురం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న పార్టీ మండల నాయకులు

ఎంపీ అభ్యర్థి ఉమాబాల

పెంటపాడు: జగనన్నతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని నర్సాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల పేర్కొన్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమెను పార్టీశ్రేణులు కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాన్యురాలినైన తనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సాపురం ఎంపీ అభ్యర్థి స్థానానికి నిలబెట్టారన్నారు. బీసీ కులాలను గుర్తించిన జగనన్న కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి ప్రధానంగా బీసీ మహిళలకు కూడా రాజకీయంగా లబ్ధి చేకూరేలా కృషిచేయడం అభినందనీయమన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రం అనుసరించని విధంగా సామాజిక న్యాయం పాటించిన జగనన్న చరిత్రలో గుర్తుండిపోతారన్నారు. వచ్చే ఎన్నికలలో జగనన్నకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను పూర్తిస్థాయిలో అందించేందుకు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కట్టుబోయిన కృష్ణప్రసాద్, చింతపల్లి శ్రీనివాస్, వాకా వెంకటసుబ్బారావు, పాలా గణపతి, పెంటపాడు, రాచర్ల ఎంపీటీసీలు రెడ్డి సూరిబాబు, చింతన శారద, దేవరశెట్టి రాంబాబు, మద్రే కృష్ణమూర్తి, బండారు రాంబాబు, బర్ల జయ రాంబాబు, రెడ్డి శ్రీను తదితరులతో పాటు, పలు గ్రామాలకు చెందిన బీసీ సంఘ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ





మాధవరంలో స్వామివారి విగ్రహం పునఃప్రతిష్ఠించిన దృశ్యం, పోటెత్తిన భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మాధవరం గ్రామంలో కోతిగుంట చెరువు గట్టున వేంచేసియున్న ఆంజనేయ స్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి గంధం దొరబాబు ఆధ్వర్యంలో గత రెండ్రోజులుగా ఇక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయంనుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోదృష్టి అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం శిఖరంపై బూరెలు పోసే కార్యక్రమం జరిగింది. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి, స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

అత్తిలి: వరిఘేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామభక్తాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం హోమాలు, పూర్ణాహుతి, గోదర్శనం పూజాదికాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అద్దాల వెంకటరత్నంబాబు, జానకి దంపతులచే స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజాదికాలను జరిపారు. బుచ్చిరామశాస్త్రి సిద్ధాంతి ఆధ్వర్యంలో మంగళంపల్లి ఆంజనేయశర్మ బ్రహ్మత్వంలో ఆగమ పండితులచే శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పూజా కార్యక్రమాల్లో పాల్గొని, స్వామవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. పరిసర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఆంజనేయస్వామివారిని దర్శించి తరించారు.



శ్రీరామభక్తాంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

'గూడెం'లో వరి కోతలు ప్రారంభం



ఎల్.అగ్రహారం గ్రామంలో కోతలు కోసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రబీ సీజన్ వరి కోతలు తాడేపల్లిగూడెం మండలంలో ప్రారంభమయ్యాయి. ఎల్.అగ్రహారం గ్రామంలో కుంచనపల్లి పరిధిలో ముందుగా వరి కోతలు కోశారు. ప్రధానంగా ఎక్సెల్-10 రకం వరి వంగడాన్ని పచ్చిపైనే కోతలు కోస్తున్నారు. జిల్లాలోనే తాడేపల్లిగూడెం మండలంలో ప్రప్రథమంగా వరి కోతలు ప్రారంభం కావడం పరిపాటిగా వస్తోంది. దీనిలో భాగంగానే ఎల్.అగ్రహారంలో వరి కోతలు ప్రారంభించారు. తదుపరి వడివడిగా మండలంలో వరి కోతలు ప్రారంభం కానున్నాయి.

ఎకరానికి 60 బస్తాల దిగుబడి



ప్రధానంగా కుంచనపల్లి పరిధిలో ఎక్సెల్-10 రకం వరి వంగడాన్ని సాగు చేశాం. ఎకరానికి 35 నుంచి 40 వేల రూపాయల ఖర్చు అయ్యింది. ఎటువంటి చీడపీడలు ఆశించలేదు. ఎకరానికి 50 నుంచి 60 బస్తాల దిగుబడి వస్తాయి. దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయి.

– రావి సత్యనారాయణ, ఎల్.అగ్రహారం, తాడేపల్లిగూడెం మండలం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

భీమవరం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్ సూర్యనారాయణ, జి.ఆస్కారరావు అన్నారు. సంఘం జిల్లా ఈసీ సభ్యుల సమావేశం ఆదివారం అంకాల ఆర్ట్ అకాడమీ భవనంలో నిర్వహించారు. జిల్లా, మండల స్థాయి నుంచి సంఘాన్ని మరింత పటిష్టం చేసుకోవాలన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

తణుకు డివిజన్ పరిధిలో హాజరుకానున్న 11,194 మంది విద్యార్థులు

తణుకు అర్బన్: పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనతోపాటు ప్రశాంతంగా పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, టాయిలెట్స్ నిర్వహణపై విద్యాశాఖ అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. పరీక్ష సమయాల్లో మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రత్యేక ఇన్విజిలేటర్లతోపాటు స్క్వాడ్ టీంలను కూడా నియమించింది. తణుకు డివిజన్ పరిధిలోని తణుకు, అత్తిలి, ఇరగవరం, పెరవలి, ఉండ్రాజవరం, యలమంచిలి, పోడూరు, ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ మండలాలకు సంబంధించి 147 పాఠశాలలు ఉండగా 50 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. ఈ కేంద్రాల్లో 11,194 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.



తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో బెంచీలపై హాల్ టికెట్ల నంబర్లు వేస్తున్న సిబ్బంది

పట్టణంలో 8 సెంటర్లలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల, సుబ్బారావుపేట, కోడే వెంకట్రావు పాఠశాల, భాష్యం, సెంట్‌ఆన్స్, జోన్స్, శ్రీ చైతన్య, మాంటిస్సోరిలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తున్నారు. గ్రామాల నుంచి పరీక్షా కేంద్రం వరకు పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులలో ప్రయాణించే విధంగా చర్యలు తీసుకున్నట్లు డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి తెలిపారు. బస్‌పాస్‌లు అవసరం లేదని, హాల్ టిక్కెట్ చూపించడం ద్వారా ఉచితంగా బస్సులలో ప్రయాణించవచ్చునని వెల్లడించారు.

అత్తిలి మండలంలో 4 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

అత్తిలి: నేటినుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అత్తిలి మండలంలో 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారులు ఎస్ రమేష్, ప్రసాద్ ఆదివారం తెలిపారు. మండలంలో బల్లిపాడు, ఆరవల్లి, కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలు, అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 564 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరౌతారని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.